క్లుప్తంగా

పశుపోషణలో యాజమాన్య పద్ధతులు పాటించాలి


పశువులకు చికిత్స అందిస్తున్న వైద్యులు

కందుకూరు: సరైన యాజమాన్య పద్ధతులతో పశుపోషణ చేపట్టి పాడి రైతులు లబ్ధిపొందాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ శ్రావణ్ కుమార్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని జైత్వారంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 105 పశువులకు పశువైద్యులు చికిత్సలు అందించారు. 38 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. వ్యాక్సిన్ల ప్రాధాన్యత, పాల దిగుబడికి సంబంధించిన మెళకువలు, పశుగ్రాస ఉత్పత్తులు, డెయిరీ బై ప్రోడక్ట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ షాహిన్‌షైక్, డాక్టర్ సంధ్య, సిబ్బంది వసంత, జంగయ్య, మాధవి, నరేశ్, అప్సర్, ఆరీఫ్, రమేశ్, మాజీ సర్పంచ్ పి.పర్వతాలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న లబ్ధిదారులు, సీపీఎం నాయకులు

కందుకూరు: కందుకూరు రెవెన్యూలో గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లకు సంబంధించి స్థలాలు చూపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి లబ్ధిదారులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు బుట్టి బాల్‌రాజు, జంగారెడ్డి మాట్లాడుతూ.. సర్వే నంబర్ 788లో 183 మంది పేదలకు ఇళ్ల సర్టిఫికెట్లు ఇచ్చి 16 సంవత్సరాలు కావొస్తుందన్నారు. మరో సర్వే నంబర్ 107లో గతేడాది 350 మందికి ఇచ్చారన్నారు. ఇప్పటివరకు లేఅవుట్ వేసి ఇళ్ల స్థలాలు కేటాయించలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు సమస్య పరిష్కరించాలని కోరినా పట్టించుకోలేదన్నారు. ఆర్డీఓ స్పందిస్తూ ఎమ్మెల్యేతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లబ్ధిదారులు రవి, మహేందర్, అరుణ, చంచల, జ్యోతి, సబియాబేగం, సక్కుభాయి, మంగ, మంగలి శివ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సంఘాల సభ్యులు

తుక్కుగూడ: జిల్లా దిశా కమిటీ సభ్యులుగా మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన అంబోజీ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆ గ్రామానికి చెందిన పలు సంఘాల సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీనివాస్ భవిష్యత్‌లో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, నక్క శ్రీశైలంయాదవ్, ఎడ్ల శ్రీశైలం యాదవ్, ఈటమోని కొమురయ్య, మల్లేశ్, శ్రీధర్, శ్రీనివాస్, నరేందర్, ఆంజనేయులు, నాగరాజు, శివకుమార్ పాల్గొన్నారు.

అధికారులపై దాడిలో బీఆర్‌ఎస్ హస్తం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: వికారాబాద్ కలెక్టర్ సహా ఇతర అధికారులపై దాడిలో బీఆర్‌ఎస్ నేతల హస్తం ఉందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోయామన్న భ్రమలో అధికారులు, కాంగ్రెస్ నాయకులపై దాడులు చేయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అధికారుల దాడిలో కొండగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాత్ర ఉండటంతో నేడు ఆయనను పోలీసులు అరెస్టు చేశారని విమర్శించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ ఒకేగూటి పక్షులన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు.

నిధులు లేక.. పనులు సాగక

అర్ధంతరంగా నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు
- పిల్లర్ల దశలోనే దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు


పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని దావుత్‌ఖాన్‌గూడలో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయి. అప్పటి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి అవసరమైన నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు మధ్యలో ఆగిపోయి నాటి పాలకులు, ప్రజల ఆశయాలను మొండి గోడలు వెక్కిరిస్తున్నాయి. పనులు ప్రారంభించినా కాంట్రాక్టర్లు పిల్లర్ల దశలోనే నిలిపివేసి డబ్బులు రాక చేతులెత్తేశారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వం మారడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో అధికారులు సమాధానమివ్వలేకపోతున్నారు.

ఎక్కడి పనులు అక్కడే..

బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని దావుత్‌ఖాన్‌గూడలోని సర్వే నెంబర్ 2లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు తగ్గట్టుగానే అప్పటి విద్యాశాఖ మంత్రి, నేటి ఎమ్మెల్యే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో చర్చించి బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రూ.4.50 కోట్లు హెచ్‌ఎండీఏ నిధులను మంజూరు చేయించారు. గతంలోనే టెండర్లు పిలవడంతో పనులు చకాచక జరిగాయి. అంతలోపు ఎన్నికలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. స్లాబుల వరకు చేరిన పిల్లర్లు అలాగే వదిలివేసి చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను మధ్యలో వదిలివేశాడు. 10 నెలలుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. అధికార పార్టీలో కాంగ్రెస్ అధినాయకత్వం, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి బీఆర్‌ఎస్‌లో ఉండటం అభివృద్ధి పనులకు తలనొప్పిగా మారింది. అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గతంలో వందల కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులు నియోజకవర్గంలో అలాగే ఆగిపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వస్తే..

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీ ప్రజల అవసరాలు తీర్చేందుకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అనే ఆలోచన వచ్చింది. అందులో కూరగాయలతో పాటు మాంసం, చికెన్, చేపలు, పప్పు దినుసులు ఇలా అన్ని ఒకేచోట దొరకేలా అదికూడా అందరికీ అందుబాటులో రోడ్డుపక్కనే ఉండేలా ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. తీరా ఈ మార్కెట్ ఎవరికీ ఉపయోగంలోకి రాకుండా పోయి.. మొండి గోడలుగా మిగిలిపోయింది. పార్టీలు పంతాలకు పోయి ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు మొదలుపెట్టాలని ప్రజలు, కాలనీలవాసులు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

బడంగ్‌పేటలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రూ.4.50 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ హెచ్‌ఎండీఏ నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వాలు మారడంతో నిధులు ఆగిపోయాయి. అయితే ఇటీవల హెచ్‌ఎండీఏ కౌన్సిల్ మీటింగ్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లకు కేటాయించిన నిధులు తిరిగి ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటా.

–యాదయ్య, డీఈఈ

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే


తుక్కుగూడలో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వాణి


మహేశ్వరం: అమీర్‌పేట్‌లో సర్వేను పరిశీలిస్తున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

- ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు
- సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీఓలు

మహేశ్వరం: కులగణన సర్వేతో సమాజంలో మార్పుతో పాటు అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆమె పరిశీలించి ప్రజలు, అధికారులను సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం ద్వారా సబ్బండ వర్గాల ప్రజలకు ఆర్థిక, సామాజిక న్యాయం చేకూరుతుందన్నారు. సంక్షేమ ఫలాలతో పాటు రాజకీయంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ తదితర అంశాల్లో వాటా లభిస్తుందన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకు సమగ్ర కులగణన ద్వారా ఇంటింటికీ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సర్వేలో తప్పులు జరగకుండా జాగ్రత్త పడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆవుల యాదయ్య పలువురు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాలు సేకరించాలి

తుక్కుగూడ: కులగణన అంశంలో ప్రజల నుంచి తప్పులు లేకుండా వివరాలను సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి ఎన్యుమరేటర్లకు సూచించారు. బుధవారం మున్సిపాలిటీలో కులగణన కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన ఉందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, మల్లేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎంవీఎస్‌ఆర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని కమ్మగూడ, ఎంఎల్‌ఆర్‌కాలనీ, బృందావనంకాలనీ, కొత్తగూడ, శ్రీపురంకాలనీ, బాలాజీ హోమ్స్, వెంకటేశ్వరకాలనీ, ప్లాటినం సిటీ, రాజలక్ష్మి నగర్, కింగ్స్ వే, లిబ్రా షెల్టర్స్, వెంకటాద్రినివాస్, ఏఎంఆర్ కాలనీ, కృష్ణా హోమ్స్, సెవన్ హిల్స్, సిద్దార్థకాలనీ, ఎంవీఎస్‌ఆర్ మెయిన్ రోడ్, మాతృశ్రీ నగర్, బండల మడుగు, శాంతినగర్, వైకుంఠపురం, విజయలక్ష్మికాలనీ, శ్రీరామ ఎన్‌క్లేవ్, ఏవీరెడ్డికాలనీ, ప్రెస్‌కాలనీ, అశోక్‌రెడ్డి ఎంప్లాయీస్‌కాలనీ, సలీమ్ వెంచర్, సాయిరామ్‌నగర్, వినాయకనగర్‌కాలనీ, ఏఎంఆర్‌కాలనీల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చెట్లకొమ్మల తొలగింపు కారణంగా..

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సిరినగర్, వాసవీకాలనీ, మన్సూరాబాద్, గణేశ్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు. 11కేవీ గణేశ్‌పురి, విశాలాంధ్ర ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. 11కేవీ గంగాహాస్పిటల్, శ్రీనివాసకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు. 11కేవీ భగత్‌సింగ్‌నగర్, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ కోటర్స్ కాలనీలో బుధవారం మేయర్ చిగురింత పారిజాత సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఒక్కొక్కటిగా అన్ని పనులు పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, డీఈఈ నర్సింహారాజు, నాయకులు ఎర్ర జైహింద్‌కుమార్, టేకుల సుధాకర్‌రెడ్డి, యాదయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలి

ప్రిన్సిపాల్ విద్యుల్లత


టాస్‌వేసి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విద్యుల్లత

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం పరిధిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు బుధవారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థినులకు అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, టెన్నీస్‌కాయిట్, షార్ట్‌పుట్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలను ప్రిన్సిపాల్ విద్యుల్లత టాస్‌వేసి ప్రారంభించారు. ప్రతీ విద్యార్థి తమకు ఇష్టమైన క్రీడల్లో ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. విద్యతో పాటుగా క్రీడల్లోనూ రాణించి గుర్తింపును తెచ్చుకోవాలన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వివిధ గురుకులాలల నుంచి తరలివచ్చిన విద్యార్థినులకు, సిబ్బందికి అన్ని వసతులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల సిబ్బంది, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


పూజల్లో పాల్గొన్న నాయకులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహంకాళి, బీరప్ప, మల్లన్న దేవాలయాల్లో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రజలు దేవాలయాల వద్దకు వెళ్లినప్పుడు నిష్టతో పూజలు చేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు సూద యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, సత్తయ్య, యాదయ్య, కుమార్, నర్సింలు, భాస్కరాచారి, మహిపాల్‌రెడ్డి, శంకర్, ఆంజనేయులు, నరేశ్‌గౌడ్, రామకృష్ణ, సాయిలు, మల్లయ్యగౌడ్, మహేశ్, ఆంజనేయులు, మహేందర్ తదితరులు ఉన్నారు.

‘అభివృద్ధికి ఆటంకం కలిగించొద్దు’

కందుకూరు: రాజకీయ ప్రయోజనాల కోసం అభివృద్ధికి ఆటంకం కలిగించొద్దని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మీడియా కో–ఆర్డినేటర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత రాజకీయాల కోసం ప్రజలను రెచ్చగొట్టి అభివృద్ధికి ఆటంకం కలిగించి ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవాలని ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. ఆమె మంత్రిగా కొనసాగిన సమయంలో వేలాది ఎకరాల భూములను రైతుల నుంచి వారి అభీష్టానికి వ్యతిరేకంగా సేకరించిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. నేడు వారే సంతాప సభ పెట్టినట్లుగా పెట్టి రైతుల మెదళ్లలో విషాన్ని నింపుతున్నారన్నారు. ప్రపంచస్థాయిలో పోటీపడేలా ఫ్యూచర్ ఫోర్త్ సిటీని నిర్మించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మాణానికి పూనుకున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కుటిల బుద్ధితో రైతులను రెచ్చగొట్టి అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో అవినీతి, అరాచకం దోపిడీ చేస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా అభివృద్ధి చేస్తుందన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మండల పశువైద్యురాలు శిరీష


పశువులను పరిశీలిస్తున్న వైద్యులు

చేవెళ్ల: పాడిపశువులను రైతులు జాగ్రత్తగా కాపాడుకోవాలని, వాటికి వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యురాలు శిరీష, పశుగణాభివృద్ధి సంస్థ డాక్టర్ జయసుధ అన్నారు. మండలంలోని పామెన గ్రామంలో బుధవారం ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతుల వద్ద ఉన్న పాడిపశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భకోశ సంబంధించిన వ్యాధులపై ప్రత్యేక అవగాహన కల్పించి అవసరమైన పశువులకు చికిత్స చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాడిపశువుల అభివృద్ధితో ప్రజలకు ఆదనపు ఆదాయం సమకూరుతుందని, వ్యాధులపై జాగ్రత్తలు తీసుకుంటే మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. సీజనల్‌గా పశువుల్లో వచ్చే వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడూ పశువులను గమనిస్తూ వాటిలో వచ్చే తేడాలను గుర్తించి వ్యాధులను నిర్ధారించుకోవాలన్నారు. గ్రామాల్లో తిరుగుతూ పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాతల కృషితో బడికి రంగులు



ముస్తాబైన ఎన్కెపల్లి పాఠశాల

- నేడు బాలల దినోత్సవానికి ముస్తాబైన ఎన్కెపల్లి పాఠశాల

మొయినాబాద్‌రూరల్: దాతల ప్రోత్సాహం, కృషితో ఎన్కెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేడు బాలల దినోత్సవానికి కొత్త రంగులు, బొమ్మలతో ముస్తాబైందని పాఠశాల హెచ్‌ఎం జి.లక్ష్మారెడ్డి, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య అన్నారు. మండల పరిధిలోని ఎన్కెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని యూనైటెడ్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్‌లాండ్ వారి దాతృత్వం, ఐ వలంటీర్ సహకారంతో గోడలపై వైట్‌వాష్, రంగు రంగుల డిజైన్స్, వివిధ మార్గదర్శకాల పదాలు, కొటేషన్స్‌తో ఆకర్షనీయంగా తీర్చిదిద్దారు. దాతల సహకారం విద్యార్థులు, గ్రామస్తులు ఎప్పటికి మరచిపోలేరని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు దాతల సహకారం ఎంతో ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా పేద విద్యార్థులు చదువుతున్నారని, దాతలు వారి ఉన్నత చదువులకు సహకరించాలని కోరారు. బాలల దినోత్సవానికి పాఠశాలను ముస్తాబు చేయించడం సంతోషకరమని లక్ష్మారెడ్డి, పోచయ్యలు పేర్కొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్


మాట్లాడుతున్న రఘునాయక్

షాద్‌నగర్: లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడి వెనక బీఆర్‌ఎస్ నేతల హస్తం ఉందని, అభివృద్ధి పనిని ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ రఘునాయక్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్, అధికారులపై దాడి ఘటన వెనక మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాత్ర ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు కుట్ర పన్నుతున్నారన్నారు. హైడ్రా, మూసీ ప్రక్షాళనను అడ్డుకునేందుకు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను రెచ్చగొట్టే విధంగా అసాంఘీక శక్తులను ప్రోత్సహిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. బీఆర్‌ఎస్ నేతల ఉడత ఊపులకు తాము భయపడేది లేదన్నారు. లగచర్ల ఘటన వెనక ఉన్న పాత్రదారులు, సూత్రదారులు ఎవరో త్వరలో ప్రజలకు తెలుస్తుందన్నారు. ఈ ఘటనపై చట్టం తన పని తాను చేస్తుందన్నారు. లేనిపోని గొడవలు సృష్టిస్తూ అరాచకాలకు బీఆర్‌ఎస్ నేతలు పాల్పడుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, చెంది మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

మాజీ ఉపసర్పంచ్ కావ్య


పాఠశాలకు పుస్తకాలను అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ కావ్య, కృష్ణాగౌడ్

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తేనే గ్రామాల అభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని కందవాడ మాజీ ఉపసర్పంచ్ జి.కావ్య, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్‌లు అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రరీకి బుధవారం కావ్య, కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ సహకారంతో 20వేల పుస్తకాలను పాఠశాల హెచ్‌ఎం లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు రీడింగ్ అలవాటు చేసేందుకు లైబ్రరీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి లైబ్రరీలో విద్యార్థులకు ఆసక్తి కలిగించే పుస్తకాలు ఉంటేనే వారు రీడింగ్ వైపు దృష్టిపెడతారన్నారు. అందుకు తగిన పుస్తకాలు లైబ్రరీలో ఉండాలనే ఉద్దేశంతో జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థను కలిసి బుక్స్‌ను ఇవ్వాలని కోరటంతో వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి 20వేల పుస్తకాలను అందజేశారన్నారు. అడిగిన వెంటనే సహకరించిన సంస్థకు వారు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన కావ్య, కృష్ణగౌడ్‌లు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. ప్రతి ఏడాది పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకోవటంతో పాటు విద్యార్థులను ప్రోత్సహించే విధంగా బహుమతులు కూడా అందజేస్తారన్నారు. జాయ్ ఆఫ్ రీడింగ్ సంస్థ పెద్దఎత్తున పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, రజినీ, దర్శన్‌గౌడ్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.